మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత



హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

బెజ్జంకి, నవంబరు 14, ప్రభాతవార్త : మండల వడ్లూరు గ్రామంలో ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహించనున్న కాలభైరవ స్వామి ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ రూరల్, నవంబరు 14, ప్రభాతవార్త : గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. హుస్నాబాద్‌లోని పొట్లపల్లి రోడ్డు వైపు దామరకుంట సమీపంలో ఉన్న తాటి, ఈతవనాలకు వెళ్లేందుకు దారిలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి అక్కడ బ్రిడ్జి నిర్మించడం తోపాటు గీత కార్మికుల తాటివనం నుంచి గుట్ట కింది ఎల్లమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ పనుల కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దామరకుంటను కబ్జాల నుంచి కాపాడి, చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. హుస్నాబాద్‌లో గీత కార్మిక సంఘం కమిటీ హాల్ నిర్మాణానికి ఐదు గుంటల స్థలం కేటాయించడంతో పాటు రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని సంఘం పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మి కులు పూదరి రాజు, ములంగూర్ శ్రీనివాస్, కోయడ బాలయ్య, పూదరి మల్లేశం, వడ్లకొండ శ్రీనివాస్, తాళ్లపెల్లి రాజయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్, బబ్బు రవీందర్, సుధగోని కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



సింగూరు ప్రాజెక్టు నుంచి జలాలను విడుదల చేసిన దృశ్యం

మంజీర రిజర్వాయర్‌కు సింగూరు జలాలు విడుదల

చౌటకూర్, నవంబరు 14, ప్రభాతవార్త : తాగునీటి అవసరాల నిమిత్తం సింగూరు ప్రాజెక్టునుంచి మంజీర జలాశయానికి శనివారం జలాలను విడుదల చేశారు. సింగూరు ప్రాజెక్టు దిగువన ఉన్న మంజీర జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా పడిపోవడంతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు మంజీర జలాశయంపై ఆధారపడిన నిర్మించిన మిషన్ భగీరథ తాగునీటి పథకాలు, జంటనగరాలైన హైదరాబాద్ సికింద్రాబాద్ పట్టణాలకు మంజీర నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సింగూరు ప్రాజెక్టు నుంచి 0.15 టీఎంసీ జలాలను విడుదల చేశారు. ప్రాజెక్టు 9వ నంబరు క్రస్ట్ గేటును 1.3 మీటరు ఎత్తి 2,880 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఎలినినో ప్రభావం కారణంగా సింగూరు ప్రాజెక్టు, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. అయితే, ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో నిల్వఉన్న నీటిలో నుండి 0.15 టీఎంసీల జలాలను దిగువకు వదిలిపెట్టారు. మంజీర జలాలు విడుదలచేయడంతో కొన్ని రోజులపాటు తాగునీటి అవసరాలు తీరనున్నాయి. 0.15 టీఎంసీల జలాలు విడుదల అనంతరం నీటి పారుదల శాఖ అధికారులు తెరిచిన క్రస్ట్ గేటును మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటటి నిల్వ సమార్థం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 541.015 మీటర్లకు 2.889 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.

భూ నిర్వాసితుల సమస్యలపై
సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, భూ నిర్వాసితుడు కీసరి నరేష్‌గౌడ్

గజ్వేల్ టౌన్, నవంబరు 14, ప్రభాతవార్త : ఈనెల 19న సిద్దిపేట జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల దీర్ఘకాలిక సమస్యలపై స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, భూనిర్వాసితుడు కీసరి నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితులు నేటికీ అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు 20 ఏళ్ల పాటు మున్సిపల్ పన్నుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు పూర్తిస్థాయి మున్సిపల్ అనుమతులు జారీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన నిర్వాసితులకు వర్తింపజేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల విలువకు సంబంధించిన పరిహారం, బై నంబర్ చెక్కులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు, ప్లాట్లు కేటాయించిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించాలని కోరారు. అలాగే భూ నిర్వాసితులకు ఇస్తామన్న ప్రతి ప్యాకేజీని అందజేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, నవంబరు 14, ప్రభాతవార్త : నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, రక్షణ కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల స్నేహపూర్వక గ్రామపంచాయతీ ప్రత్యేక గ్రామ సభను సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమేకాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు రమేష్‌గౌడ్, అహ్మద్, వార్డు సభ్యులు కనకరాజు, రాములు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌కు ఫిట్స్..

కండక్టర్ అప్రమత్తతో తప్పిన ప్రమాదం

నర్సాపూర్, నవంబరు 14 ప్రభాతవార్త : ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శని వారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ గురుకుల పాఠశాలకు చెందిన స్కూల్ బస్ ప్రమాదానికి గురైంది. సాయంత్రం పాఠశాల సమయం అయిపోయాక విద్యార్థులందరూ తమ తమ ఇండ్లకు వెళ్లడానికి బస్సు ఎక్కారు. బస్సు డ్రైవర్ ప్రభాకర్ బస్సును తోలుతూ కొద్ది దూరం రాగానే ఫిట్స్‌కు గురయ్యాడు. దాంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ ఆటో, మూడు ద్విచక్ర వాహనాలను వేగంగా గుద్దుకుంటూ బస్సు ముందుకు సాగింది. ఓ బైక్ బస్సు చక్రాల కింద పడడంతో బస్సు వేగం తగ్గింది. బస్సులో ఉన్న కండక్టర్ అప్రమత్తమై బస్సును పూర్తిగా నిలిపివేశాడు. ఈ ప్రమాదంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురై ఏడుపులతో ఆహాకారాలు చేశారు. ఇది గమనించిన అక్కడ ఉన్న స్థానికులు బస్సులోని విద్యార్థులను కిందికి దింపివేశారు. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో 18 మంది విద్యార్థులు ఉన్నారని స్థానికులు వెల్లడించారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేని డ్రైవర్ను విధుల్లో పెట్టుకుని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత్ సమ్మిట్ కాదు..ఎన్నికల ముందు ఇచ్చిన
ఆరు గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలి

బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్



మాట్లాడుతున్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్

మెదక్, నవంబరు 14, ప్రభాతవార్త

మెదక్‌జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కాదు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో ఎందుకు విఫలమైందో చెప్పాలని బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ డిమాండ్‌చేశారు. మెదక్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బిజెపి జిల్లా శాఖ నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశంగౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలన్నారు. అలాగే మహిళలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు, పేదలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితి ఏమిటి? ఒకవైపు రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, విద్యా ర్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే, మరోవైపు ప్రజాధనంతో భారీ అంతర్జాతీయ సమ్మిట్ నిర్వహించాల్సిన అవసరం ఏమిటి? భారత్ సమ్మిట్ పేరుతో ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతుంది? ఎన్ని పెట్టుబడులు వస్తాయి? ఎంత మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయి? ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు? ప్రభుత్వం ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ గురించి ప్రపంచానికి ఉపన్యాసాలు ఇచ్చే కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో బిజెపి నాయకులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ఎందుకు అడ్డుకుంటోంది ? అని ఆయన ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును హౌస్ అరెస్ట్ చేయడం, కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ప్రజల సమస్యలపై సమాధానం చెప్పాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై వివరణ ఇవ్వాలని బిజెపి ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తుందన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తుమని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని తెలిపారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజాధనానికి లెక్కచెప్పాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, రైతుల సమస్యలను పరిష్కరిండాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లోకబోయిన లోకేష్, అల్లం మధు, ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిత, కర్రోల్ల స్వామి, ఎస్సి మోర్చా మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రే పోచయ్య, భాను ప్రసాద్ ఎండోమెంట్ సెల్ జిల్లా నాయకులు వేణు, ఎస్సి మోర్చా జిల్లా నాయకులు, బాబు, కిష్టయ్య, బిజెపి సీనియర్ నాయకులు వరప్రసాద్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు

టిఆర్ఎస్ చీఫ్ కవిత వ్యాఖ్యలన్నీ అవాస్తవాలే

బిఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, నవంబరు 14, ప్రభాతవార్త : టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సిద్దిపేటలో చేసిన వ్యాఖ్యలలో వాస్తవాలు లేవని...రానున్న రోజుల్లో ఆ పార్టీకి ఒక్క సీటూరాదని బిఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, ములకల కనకరాజు, ఇట్టబోయిన శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్, కాముని ఉమేష్‌చంద్ర అన్నారు. చిన్నకోడూరులో శనివారం వారు మాట్లాడుతూ, కవిత వ్యాఖ్యలు ఆమె అనుసరిస్తున్న తీరు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి బి టీంగా పనిచేస్తున్నట్లు అనిపిస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివారే తప్ప రాజకీయ పరిజ్ఞానం ఏమాత్రం లేదని వారు ఎద్దేవా చేశారు. అబద్ధాల మాటలు, కల్లబొల్లి మాటలు నిరాధారమైన ఆరోపణలు అవినీతి చేసినట్లు తప్పుడు వ్యాఖ్యలు చేయడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాజకీయ వ్యూహానికి అనుగుణంగానే కవిత వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతాన్నాయని విమర్శించారు. కవిత మాట్లాడుతున్న మాటలే రేపు సిఎం మాట్లాడబోతున్నారని తెలిపారు. లిక్కర్ కేసు వ్యవహారంలో రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కవిత సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి మోడీతో రాజకీయ సంబంధాల దిశగా కవిత ప్రయాణం సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. హరీష్‌రావుపై ఆరోపణలు చేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. వ్యక్తిగత స్వలాభం కోసం రాజకీయ విలువలను దిగజార్చువద్దన్నారు. హరీష్‌రావుపై చేసిన వ్యాఖ్యలను కవిత పున:పరిశీలించి తన మాటలకు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య, కొండం రవీందర్‌రెడ్డి, రేగుల దేవయ్య, సురేందర్‌రెడ్డి, కనకయ్య, రాజశేఖర్‌రెడ్డి, మన్నె అనంద్, నవీన్, భాను తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

సిద్దిపేట అర్బన్, నవంబరు 14, ప్రభాతవార్త: సిద్దిపేట పట్టణంలోని 2054 సర్వే నవంబర్‌లోఉన్న భూమికి సంబంధించి కొంత మంది వ్యక్తులు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని బిఆర్ఎస్ నాయకులు వరాల సురేష్, బాధితుడు రాజిరెడ్డి తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా తమపై ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యహరించడం సరికాదన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2054లో సర్వే నంబరులో డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాతే ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. భూమికి సంబంధించిన వ్యవహారంలో ఇప్పటికే మూడు పర్యాయాలు కోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా వచ్చాయన్నారు. కోర్టు ఆదేశాలు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ కొంత మంది వ్యక్తులు తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో వేముల నగేష్, గూడరి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

గుండెపోటుతో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి మృతి

కొల్చారం, నవంబరు 14 ప్రభాతవార్త

పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామ పంచాయతీ తొలి సర్పంచ్ పట్లోళ్ల అంజిరెడ్డి(90) గుండె పోటుతో శనివారం మృతి చెందారు. ముదిమాణిక్యం పంచాయతీ నుండి వేరు పడిన బస్వాపూర్+ గ్రామ సర్పంచుగా పోటీ చేసి గెలుపొంది ఏడేళ్ల పాటు పనిచేశారు. మృతుడికి భార్య రాజెమ్మ, ఇద్దరు కుమారులలు సురేష్రెడ్డి, రణధీర్ రెడ్డి ఉన్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. మాజీ సర్పంచ్ పట్లోళ్ల అంజిరెడ్డి మృతి పట్ల సర్పంచ్ పట్లోళ్ల భూంరెడ్డి, మాజీ సర్పంచ్ బేగరి విష్ణయ్యలు సంతాపం తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి తొలి సర్పంచుగా పనిచేసిన అంజిరెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేసి గుర్తింపు తెచ్చారని వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతా పాన్ని వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

పాపన్నపేట, నవంబరు 14, ప్రభాతవార్త

మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామ మాజీ సర్పంచ్ అంతటి దానయ్య శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. దానయ్య మృతితో గ్రామస్తులు, మండల ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2019 సంవత్సరం నుంచి 2024 వరకు సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్ననలను పొందారు. గతంలో ఉపసర్పంచ్ గా సైతం పనిచేశారు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

వరి సాగుపై ఆంక్షలెందుకు ?

విత్తనాల అమ్మకాల నిలిపివేత ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి..జిల్లా కలెక్టర్‌కు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు



మాట్లాడుతున్న రాగి రాములు

రామాయంపేట, నవంబరు 14, ప్రభాతవార్త

మెదక్ జిల్లాలో వరిసాగుపై ఆంక్షలు విధించడం, విత్తనాల విక్రయాలను నిలిపివేయాలని వ్యాపారులకు ఆదేశాలు జారీచేయడంపై బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు ఏ పంట సాగు చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను అధికారులు హరించవద్దని, వరి విత్తనాల అమ్మకాలపై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించి, మిగతా ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు నివేదికలు ఇస్తున్నారని తెలిపారు. అలాంటప్పుడు అదే అధికారులు వరి సాగు చేయవద్దని రైతులకు సూచించడం, విత్తనాల విక్రయాలను అడ్డుకోవడం వెనుక ఉన్న కారణమేంటని ప్రశ్నించారు. అధికారుల వర్షపాత నివేదికలకు, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులకు పొంతనలేదని విమర్శించారు. రామాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల రైతులు మరింత అయోమయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యత, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకుంటారని, వారికి అవసరమైన సూచనలు ఇవ్వాల్సిన అధికారులు ఆంక్షల పేరుతో సాగు నిర్ణయాలను నియంత్రించడం సరికాదన్నారు. జిల్లాలో కరువు పరిస్థితులు ఉంటే మొత్తం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని, సమృద్ధిగా వర్షపాతం నమోదైనట్లు చెబుతున్న నివేదికలు వాస్తవమైతే వరిసాగుపై ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు.

అలాగే వరి విత్తనాల విక్రయాలను నిలిపివేయాలని వ్యాపారులకు జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అన్ని విత్తన దుకాణాల్లో నాణ్యమైన వరి విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిపై సమగ్ర పరిశీలన జరిపి వాస్తవ నివేదికలను ప్రజలకు వెల్లడించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం వారి సాగు స్వేచ్ఛకు అడ్డంకిగా మారకూడదని రాగి రాములు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రైతులకు స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాక్షేత్రంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన తాహేర్ సాహెబ్ (ఫైల్‌ఫొటో)

నర్సాపూర్, నవంబరు 14 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం... మెదక్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ తాహెర్ సాహెబ్(52) శుక్రవారం నర్సాపూర్‌లోని సంగారెడ్డి మార్గంలోఉన్న క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన విందుకు కుమారుడు మహ్మద్ ఖాజాతో కలిసి హాజరయ్యాడు. విందు అనంతరం బైక్‌పై తిరిగి మెదక్‌కు వెళ్తుండగా, శనివారం తెల్లవారుజామున 12.15 గంటలప్రాంతంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను, మరో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ తాహెర్ సాహెబ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు ఖాజాతో పాటు రెండో బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని పోలీసులు నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు.

వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి
ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు..పలువురికి స్వల్ప గాయాలు

మొగుడంపల్లి, నవంబరు 14 ప్రభాతవార్త: చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్ణాటక ఆర్టీసీకి చెందిన బస్సు ముందు వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక ఆర్టీసీ బస్సు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యలో ముందు వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలకు తోడ్పడ్డారు. సమాచారం అందుకున్న చిరాగ్‌పల్లి పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రమాదానికి గురైన వాహనాలను పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. రహదారిపై ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తూ విచారణ చేపట్టారు. ప్రయాణికులు రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచిస్తున్నారు.



ధ్వంసమైన బస్సు ముందు భాగం

రహదారులపై ధాన్యం ఆరబెడితే చర్యలు తప్పవు

ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్

పాపన్నపేట, నవంబరు 14, ప్రభాతవార్త : రహదారులపై ధాన్యం ఆరబెట్టి వాహనదారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ రైతులకు సూచించారు. రహదారులు వాహనాల రాకపోకల కోసమేనని, ధాన్యం ఆరబెట్టేందుకు కాదని స్పష్టం చేశారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైతే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం యూసుఫ్‌పేట వద్ద రహదారిపై ధాన్యం ఆరబెడుతున్న రైతులకు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. రహదారులపై ధాన్యం కుప్పలు పోయడం, ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంకలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం వాహనదారులకు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు ధాన్యంపై ప్రయాణించే క్రమంలో అదుపుతప్పి కిందపడితే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంటను కాపాడుకునే క్రమంలో ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని రైతులకు హితవు పలికారు. రహదారులకు దూరంగా పొలాల్లో లేదా ఇతర అనువైన ప్రదేశాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు. రహదారులపై ధాన్యంఆరబెట్టిప్రమాదాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రైతులు పోలీసుల సూచనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగావ్యవహరించాలని కోరారు.

రైతులకు మద్దతు ధర అందించేందుకే
కొనుగోలు కేంద్రాలు : ఒగ్గు దామోదర్

బెజ్జంకి, నవంబరు 14, ప్రభాతవార్త :

రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పిఏసిఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ అన్నారు. శనివారం మండలంలోని గుండారం, కల్లేపల్లి, పెరుకబండ, లక్ష్మీపూర్, గాగిల్లాపూర్, తిమ్మాయిపల్లి గ్రామాల్లో పిఏసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పిఏసిఎస్, ఎఎంసి డైరెక్టర్లు, సిబ్బంది, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

జూపార్క్ ఆవరణలో నెహ్రూ జయంతి



చార్మినార్, నవంబరు, 14(ప్రభాతవార్త :
భారత దేశ ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ జయంతి సందర్భంగా శని వారం నెహ్రూ జూ పార్కు ఆవరణలో ఉన్న నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూల మా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మెన్ పులిపాటి రాజేష్ కుమార్. కాంగ్రెస్ నాయకులు జి. కన్నయ్య లాల్. ముజాహిద్ హుస్సేన్, ఇక్బాల్, ముశాకాసీం, గణేష్, జయ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఆకస్మిక తనిఖీలు ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో మాజీ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం తగదని, సమస్యల పట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. శనివారం అలీ కేఫ్ చౌరస్తాలో ఆయన ఆకస్మికంగా పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కలుషిత మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, వీధి దీపాలు పనిచేయకపోవడం, రహదారులపై చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పనిచేయని వీధి దీపాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రహదారులపై చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యతని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, ఉద్యమ నేత మల్లికార్జున్ యాదవ్, రామారావు యాదవ్, లింగం గౌడ్, మహేష్ ముదిరాజ్, జలమండలి అధికారులు డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ, మేనేజర్ నజీర్, జిహెచ్ఎంసి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి : గోవర్ధన్



ఆలయంలో శ్రమదానం నిర్వహిస్తున్న పల్లపు గోవర్ధన్

జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్త:
ఆలయాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గ సీనియర్ నేత పల్లపు గోవర్ధన్ విమర్శించారు. ఫిల్మ్‌నగర్‌లోని వినాయకనగర్ శ్రీ పర్వతాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో భారీ శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, హిందూ సంఘాల ప్రతినిధుల పెద్దెత్తున హాజరయ్యారు. దాదాపు 500 మందికి పైగా కార్యకర్తలు, నాయకులు పాల్గొని ఆలయ పరిసరాలను మొత్తం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పల్లపు గోవర్ధన్ మాట్లాడుతూ.. శ్రీ పర్వతాంజనేయ స్వామి ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోందని, ఆలయ పరిరక్షణపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఒకవైపు ఆలయ స్థలం ఆక్రమణకు గురవుతుండగా, మరోవైపు భక్తులకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం చుట్టూ వెంటనే ప్రహరీ నిర్మిస్తే స్థల ఆక్రమణలను అడ్డుకోవచ్చని సూచించారు. అధికారులు స్పందించకపోతే హిందూ సంఘాలతో కలిసి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల పరిరక్షణతో పాటు శ్రమదాన కార్యక్రమాలను రానున్న రోజుల్లో మరింత విస్తృతంగానిర్వహిస్తామని తెలిపారు.

చాంద్రాయణగుట్టలో బల్దియా పవిత్ర వస్తువుల సేకరణ



పవిత్ర వస్తువుల సేకరణన శిబిరంలో జీహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది

చాంద్రాయణగుట్ట, నవంబరు 14, ప్రభాతవార్త : 'సంప్రదాయాన్ని కాపాడుకుంటూ..పర్యావరణాన్ని పరిరక్షించుకుందామంటూ' జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్, చాంద్రాయణగుట్ట సర్కిల్లోని చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయంలో దేవుళ్ల పవిత్ర వస్తువుల సేకరణా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.పాపయ్య పర్యవేక్షణలో డిఈఈ బాను ప్రతాప్ ఆధ్వర్యంలో ఏఈఈ హర్ష, ఎస్ఎస్ లింగారెడ్డి, ఎస్జెలు సంతోష్, బాలకృష్ణ, ఎస్ఎఫ్ఎ వాహెబుద్దీన్, సిబ్బంది ఉదయం 8.30 గంటల నుండి 11 గంటల వరకు సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి పాత దేవతా చిత్రాలు, క్యాలెండర్లు, ఫ్రేములు, పాత విగ్రహాలు, మాలిన్యాలు, పూజా సామాగ్రిని వేర్వేరు పెట్టెల్లో సేకరించారు. బల్దియా అధికారులు పవిత్ర వస్తువుల సేకరణ పేరుతో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దేవుళ్ల కళా విహీనమైన, పాడైన చిత్రపటాలు, ఫ్రేమ్‌లు, విగ్రహాలను, మాలిన్యాలను ఎక్కడ విసర్జించాలో తెలియక ఇళ్ళలోనో, చెత్తకుండీలు, పాడు బడిన బావులు, చెరువులు, చెట్ల పొదల్లో వేయకుండా ఇలా ప్రత్యేక శిబిరం నిర్వహించటం పవిత్ర కార్యమని దేవి దేవాలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ పేర్కొన్నారు. ఇలాంటి శిబిరాలు చేపట్టే ముందు ప్రజల్లో తగిన ప్రచారం కల్పిస్తే మంచి స్పందన లభిస్తుందన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుచిత్ర, కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్స్‌లో బాలల దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం



బాలల దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి ఎసతీష్‌రావు



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు130 సైకిళ్లను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి దానం నాగేందర్ ,ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షరీఫ్ బాయి, డివిజన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గౌలిపుర డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కార్తీక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీ నియర్ కాంగ్రెస్ నాయకులు అల్లం భాస్కర్, కే. రవిరాజ్, మామిడి కృష్ణ, రాజుయాదవ్, కార్తీక్, డల్లు శివ కుమార్, మామిడి శ్రీనివాస పాల్గొన్నారు.



బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి ఎంక్లేవ్ సంక్షేమ సంఘం సభ్యులు



మధురానగర్ స్టేట్ హోమ్‌లోని శిశువిహార్‌లో పిల్లలకు ఆట వస్తువులను, దుస్తులను పంపిణి చేసిన డాక్టర్ రవి శేఖర్‌రెడ్డి

భగవాన్ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు

-17 నుంచి 23 వరకు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు



భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లేశ్వరరావు, దేవేందర్, వై.శ్రీనివాసరావు

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త
భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలను పురస్కరించుకుని నల్లకుంటలోని శివం మందిరంలో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు వారం రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి స్టేట్ ట్రస్ట్, శ్రీ సత్యసాయి సేవ ఆర్గనైజేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు తెలిపారు. శనివారం శివంలో హైదరాబాద్ జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్ డి దేవేందర్, మీడియా ఇన్‌చార్జ్ వై.శ్రీనివాసరావులతో కలిసి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, పూజలు, భజనలు నిర్వహించనున్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని 16 సత్యసాయి సమితుల నుంచి పల్లకీలు శివం మందిరానికి చేరుకుని పల్లకీ సేవ నిర్వహిస్తాయి. అదే రోజు నిత్య నారాయణ సేవ ప్రారంభమవుతుంది. బాలవికాస్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్య నాటికలు, సంగీత విభావరి, ఆధ్యాత్మిక చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ నెల 19న సత్యసాయి సత్యనారాయణ వ్రతాలు, 20న సాయికథ నృత్య ప్రదర్శన, 21న పూర్వ విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమం, 22న సంగీత వాద్య విభావరి నిర్వహించనున్నారు. 23న మహా రుద్రాభిషేకం సత్యసాయి బాబా జన్మదినమైన ఈనెల 23న ఉదయం 5.15 గంటలకు సాయి జగన్నాథ రథోత్సవం, నగర సంకీర్తన నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు 101 మంది వేద పండితులతో మహా రుద్రాభిషేకం, 11.30 గంటలకు మహా నారాయణ సేవ జరగనున్నాయి. సాయంత్రం సంగీత విభావరి, ఊయల సేవ, కేక్ కటింగ్, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులు పొందాలని మల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సురక్షిత సోలార్ అవసరం : శాస్త్రవేత్త ఇబ్రామ్ గణేష్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గణేష్

హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త: సౌరశక్తిని సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పర్యావరణ ప్రభావాలను తగ్గించే సురక్షిత సోలార్ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నామని శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రామ్ గణేష్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత 18 ఏళ్లుగా సోలార్ ప్యానెళ్ల సామర్థం పెంపు, సూర్య రశ్మిని నిల్వ చేసి పెట్రోల్, డీజిల్ వంటి సింథటిక్ ఇంధనాలుగా మార్చే సాంకేతికతపై పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సోలార్ ప్యానెళ్లలో విద్యుత్ ఉత్పత్తితోపాటు వెలువడే ఉష్ణశక్తి వృథా అవుతోందని, దానిని కూడా సేకరించి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యంతో ఎస్ఎల్‌ఏపి (సెమీకండక్టర్ అండ్ లిక్విడ్ అసిస్టెడ్ ఫోటోథెర్మల్ ఎఫెక్ట్) సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నామని, దీని ద్వారా సోలార్ ప్యానెళ్లలో ఉత్పత్తయ్యే వేడిని ద్రవ మాధ్యమం ద్వారా సేకరించి అదనపు విద్యుత్, వేడి నీటిని ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ప్రస్తుతం ఐదారుగురు సభ్యులతో కూడిన తమ ఫౌండేషన్ బృందం సొంత నిధులతో సోలార్ పరిశోధనలు కొనసాగిస్తోందన్నారు. తమ ఆవిష్కరణలను నిపుణుల కమిటీతో పరిశీలించి, శాస్త్రీయంగా నిర్ధారితమైతే ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతోపాటు దేశ ఇంధన స్వావలంబనకు ఉపయోగపడే సురక్షిత సోలార్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని డాక్టర్ ఇబ్రామ్ గణేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఇంబ్రామ్ అన్నపూర్ణ, డా. ఇబ్రామ్ రాజ్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచితనం, మానవత్వానికి సంకేతం కళాకారులను ఆదుకోవడం : కె.వి.రమణాచారి



విమలక్కను శ్రీమతి స్నేహలత మురళి కీర్తి పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, కొండలరావు, లక్ష్మీనారాయణ తదితర అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 14 ప్రభాతవార్త : పేద జానపద కళాకారుల కష్టాలు, బాధలు, పరిస్థితులు వర్ణనాతీతం... బాధాకరమని, ఇలాంటి నిర్వాహక సంస్థలు ముందుకొచ్చి వీరికి తమకు వీలైనంత వరకు ఆర్థిక సహాయసహకారాలు అందించి ఆదుకోవడం మంచితనానికి సంకేతం, మానవత్వానికి సంకేతం, ఎంతో ముదావహమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ముఖ్యంగా జానపద కళాకారులు కళాప్రదర్శనలకు వెళ్లేసమయంలో ప్రమాదాలకు గురైన వారికి సహాయం చేయడం శ్లాఘనీయమని సంఘం, సారిపల్లి కొండలరావు సేవలను అభినందించారు. ముఖ్యంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు, బహుజన బతుకమ్మ ఛైర్‌పర్సన్, గొప్ప కళాకారిణి విమలక్క సమాజం కోసం చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. విమలక్క సామాజికవర్గంలో ఆమె అరుణోదయం... ఆమెను చూస్తూవుంటే ఒక పూలబుట్ట అని అభివర్ణించారు. మంచిపని చేసేవారిలో దైవం కొలువై ఉంటాడని, గత తొమ్మిదేళ్లుగా సారిపల్లి కొండలరావు ప్రతీనెలా పేద కళాకారుల కోసం లక్షరూపాయల ఆర్థిక సహాయ వితరణ కావిస్తూ ఆదుకొంటున్న కనిపించే దైవం సారిపల్లి కొండలరావు అని రమణాచారి అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి కశాఖ, సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ సౌజన్యంతో యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు పి.మురళీకృష్ణ, సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య, నారాయణ, ఆదినారాయణ, విజయశ్రీ, లలిత తదితరులతో కలిసి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు, బహుజన బతుకమ్మ ఛైర్‌పర్సన్ విమలక్కను ఘనంగా సత్కరించి శ్రీమతి స్నేహలత మురళి కీర్తి పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం పలువురు పేద జానపద కళాకారులకు నగదు పురస్కారం ప్రదానంచేసి ఆర్థిక సహకారం అందించారు.

జైన భగవతి దీక్ష మహోత్సవం ఊరేగింపు



జైన్ స్వాధీ దీక్షాకు ముందు 25ఏళ్ల సంజన లునావత్, జైన్‌ప్రతినిధులు

గోషామహల్, నవంబర్ 14ప్రభాతవార్త:
మహారాష్ట్రకు చెందిన 25ఏళ్ల సంజన లునావత్‌జైన్ స్వాధీ దీక్ష స్వీకరించనున్న నేపథ్యంలో జైన భగవతి దీక్ష మహోత్సవంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఘనమైన ఊరేగింపులో సుమారు 3వేల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. శనివారం లలిత కళాతోరణం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి మెట్రో స్టేషన్, గాంధీభవన్, అజంతా గేట్‌మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌చేరుకుంది. పాతకాల పు, కార్లు, గుర్రాలు, సంప్రదాయ వాయిద్య బృందాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎగ్జిబిషన్ మైదానంలో సంజన సంప్రదాయ పర్షీదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తనవ్యక్తిగత విలువైన వస్తువులు, ఆస్తులు, నగదును దానం చేశారు. ప్రాపంచిక జీవితంపై మమకారాన్ని విడిచిపెట్టి, త్యాగం, వైరాగ్య మార్గంలో పయనించడానికి ఇది ప్రతీకగా నిలిచింది. ఎం.బి.ఏ పూర్తి చేసిన సంజన ఫ్యాషన్‌డిజైనింగ్‌లో శిక్షణ పొందడమే కాకుండా సొంతంగా బొటిక్ ప్రారంభించి వ్యాపారంలోను మంచి గుర్తింపుతెచ్చుకున్నారు. అయితే 12ఏళ్ల వయస్సు నుంచే జైన ధర్మం, ఆధ్యాత్మికత పట్ల ఆకర్షితులైన ఆమె తన కెరీర్‌వ్యాపారం, భౌతిక సుఖాలను వదులుకుని జీవితాన్ని జైన ధరానమనికి అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. జైన భగవతి దీక్ష కార్యక్రమం ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో పూజ్యఆచార్య1008 జ్ఞానచంద్రజీమహారాజ్ సాహెబ్ మార్గదర్శకత్వంలో జరగనుంది. వందలాదిమంది భక్తులు హాజరవుతారన్నారు.

శతజయంతి ఉత్సవాలను రెండు రాష్ట్రాల్లో నిర్వహించాలి



నటుడు సంజీవికి ఏ.ఆర్. కృష్ణ దుగ్గిరాల సోమేశ్వరరావు పురస్కారాన్ని ప్రధానం చేస్తున్న పూర్వ శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, గుమ్మడి గోపాలకృష్ణ, రఘురాం, డాక్టర్ దుగ్గిరాల గౌరిపతి శాస్త్రి, ఆడుసుమల్లి ప్రకాష్ నీలం, గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధనమూర్తి,

చిక్కడపల్లి నవంబర్ 14 ప్రభాతవార్త : నాటక రంగాన్నే శ్వాసగా, కళాకారుల అభ్యున్నతే లక్ష్యంగా అవిశ్రాంత కృషి చేసిన ఏ.ఆర్. కృష్ణ తెలుగు నాటక రంగ స్వర్ణయుగ కర్త అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు, ఏపీ పూర్వ శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. శనివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో పద్మభూషణ్ ఏ.ఆర్. కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏ.ఆర్. కృష్ణ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ రచయిత, నటుడు సంజీవికి ఏ.ఆర్. కృష్ణ దుగ్గిరాల సోమేశ్వరరావు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం గానసభలో జరిగింది. ముఖ్య అతిథిగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని, అనంతరం నాటక రంగంలో వివిధ దేశాల్లో అధ్యయనం చేసిన ఏ.ఆర్. కృష్ణ, తెలుగు రంగస్థలంపై వినూత్న ప్రయోగాలతో సంచలనం సృష్టించారన్నారు. 100 మంది కళాకారులతో ప్రయోగాత్మకంగా మాలపల్లి నాటకాన్ని ప్రదర్శించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. తెలుగు వారి గొప్పతనాన్ని చాటిచెప్పేలా కృష్ణ శతజయంతి ఉత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడాది పొడవునా నిర్వహించాలని ఆకాంక్షించారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటక రంగంలో తొలిసారిగా పద్మభూషణ్ పురస్కారం అందుకున్న ఘనత ఏ.ఆర్. కృష్ణకే దక్కుతుందన్నారు. ఆయన స్థాపించిన నట శిక్షణ కేంద్రం ద్వారా ఎందరో గొప్ప కళాకారులు దేశానికి పరిచయమయ్యారని, వారిలో పురస్కార గ్రహీత సంజీవి ఒకరని పేర్కొన్నారు. సినిమా, నాటకం, టీవీ మాధ్యమాల్లో రచయితగా అగ్రస్థానంలో నిలిచిన సంజీవి నిస్వార్థ కళాప్రియుడని ప్రశంసించారు. ఏ.ఆర్. కృష్ణ విగ్రహాల స్థాపనకు రెండు తెలుగు రాష్ట్రాల్లో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి, ప్రముఖ రంగస్థల ప్రయోక్త డి.ఎస్.ఎన్. మూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, కృష్ణ సోమేశ్వరరావుల కుమారులు డాక్టర్ దుగ్గిరాల గౌరిపతి శాస్త్రి, ప్రకాష్ నీలం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కులో ఉచిత మధుమేహ శిబిరం



సంపత్ రెడ్డి ని సత్కరిస్తున్న తెలంగాణ హై కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.సురేందర్ రెడ్డి

చిక్కడపల్లి నవంబర్ 14 (ప్రభాతవార్త) :
ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉజ్వల్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్ కుమార్, సీనియర్ డైటీషియన్ డాక్టర్ సౌజన్య పాల్గొని మధుమేహం, డయాబెటిక్ నెఫ్రోపతి నివారణ, ఆహార నియమాలు, నిత్య వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై నడకదారులకు సూచనలు చేశారు. ఇదే వేదికపై క్లబ్ మాజీ అధ్యక్షుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు కె.సంపత్ రెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హై కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.సురేందర్ రెడ్డి, క్లబ్ పూర్వ అధ్యక్షులు రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

యువతులకు వేధింపులు.. ప్రైవేట్ చిత్రాలతో బెదిరింపులు

జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్త: సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకుని మహిళలను ప్రేమ పేరుతో మోసం చేయడం, లైంగిక వేధింపులకు పాల్పడటం, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొన్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన ఓ మహిళకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎలిచిపురం శరత్‌చంద్ర (39) పరిచయమయ్యాడు. ఆ పరిచయం కాస్తా సంబంధంగా మారిన అనంతరం, మద్యం మత్తులో ఉన్న సమయంలో తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. పలుమార్లు తన ఇష్టానికి వ్యతిరేకంగా శారీరక సంబంధం కోసం బలవంతం చేయడంతో పాటు, శారీరకంగా దాడి చేసి చంపేస్తానని బెదిరించాడని ఆరోపించింది. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేయడమే కాకుండా, వాటిని దుర్వినియోగం చేసి ఇతరులకు పంపించాడని తెలిపింది. సంబంధం తెగిపోయిన తర్వాత కూడా తనను, కుటుంబ సభ్యులను వేధిస్తూ అవమానాలకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు
మరో ఘటనలో.. టీవీ సీరియళ్లలో నటించే అవకాశాలు కల్పిస్తానని నమ్మించి ఓ మహిళను బొరగడ్డ కాళిదాస్ అనే వ్యక్తి మోసం చేశాడు. నటన అవకాశాలతో పాటు యూట్యూబ్ ద్వారా డబ్బులు సంపాదించవచ్చని చెప్పి ఆమెతో పరిచయం పెంచుకున్నాడని, అనంతరం శారీరక సంబంధం కోసం బలవంతం చేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తనకు తెలియకుండా నగ్న చిత్రాలు తీసి, తిరిగి తన వద్దకు రాకపోతే వాటిని బంధువులకు పంపిస్తానని, సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడని తెలిపింది. చంపేస్తానని కూడా హెచ్చరించినట్లు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో నుండి వెళ్లిన యువతి అదృశ్యం..

అత్తాపూర్ నవంబరు 11,ప్రభాతవార్త : కుటుంబ సభ్యులకు తెలియకుండా ఓ యువతి ఇంట్లో నుండి వెళ్లిపోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుం ది. పోలీసులు వివరాల ప్రకారం...రాజేంద్రనగర్‌లో పిఎస్ పరిధిలో ఓ యువతి (17) గతంలో ఓ యువకుడితో వెళ్లి పెళ్లి చేసుకుంది. కుటుంబ సభ్యులు కుమార్తెను తీసుకొవచ్చారు. ఎడవ తరగతి చదువుతున్న యువతి స్కూల్ మానేసి ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలోనే శుక్రవారం స్కూల్‌కి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గతంలో పెళ్లైన యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిజాంపేట్‌లో 60 ఏళ్ల మహిళ అదృశ్యం..

కొంపల్లి, నవంబర్ 14, ప్రభాతవార్త : బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో 60 ఏళ్ల మహిళ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. మహిళ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా, బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జర్నలిస్ట్ కాలనీకి చెందిన ముక్కర్ల లాలయ్య భార్య ముక్కర్ల రాధిక (60) ఇంటి నుంచి వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారి వద్ద ఆమె కోసం గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఆమె ఉపయోగిస్తున్న ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎం.బి. రాజేంద్ర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆమె ఎక్కడికి వెళ్లారు, ఏ పరిస్థితుల్లో కనిపించకుండా పోయారనే విషయాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ముక్కర్ల రాధిక ఆచూకీ తెలిసిన వారు 8712663160 నంబర్‌కు సమాచారం అందించాలని బాచుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ దాలినాయుడు కోరారు.

ఆటో వెనుక సీటులో మృతదేహం..

సంజీవరెడ్డినగర్, నవంబర్ 14, ప్రభాతవార్త:
ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో వెనుక సీటులో వ్యక్తి మృతదేహం లభించడం కలకలం రేపింది. ఐపీఎస్ క్వార్టర్స్ లైన్‌లో నిలిపి ఉంచిన ఆటోలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సార్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆటోను, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఓటర్ ఐడి ఆధారంగా ఉడుత శంకర్ గౌడ్ (35)గా గుర్తించారు. పోలీసుల ప్రాథమిక పరిశీలనలో మృతుడి శరీరంపై ఎలాంటి గాయాల ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. అయితే శంకర్‌గౌడ్ మృతికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలను నిర్ధారించనున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్సార్‌నగర్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అత్త పేరుతో వాట్సాప్ సందేశం..

కోడలికి రూ.40 వేల సైబర్ మోసం

జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్త: అత్త వాట్సాప్ ఖాతా నుంచే సందేశం రావడంతో నమ్మిన ఓ కోడలు రూ.40 వేలు సైబర్ మోసానికి గురైంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేటలోని ఓయూ కాలనీకి చెందిన సైనీ మానసకు తన అత్త వాట్సాప్ ఖాతా నుంచి సందేశం వచ్చింది. యూపీఐ పనిచేయడం లేదని, అత్యవసరంగా రూ.40 వేలు కావాలని అందులో కోరారు. అత్త నుంచి సందేశం రావడంతో నిజమని నమ్మిన ఆమె ఫోన్‌పే ద్వారా రూ.40 వేలు పంపించింది. అనంతరం అత్తను సంప్రదించగా తాను డబ్బులు అడగలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించింది. ఈ మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఎస్‌బీఐ యాప్‌తో రూ.1.37 లక్షలు..

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు అధికారులమంటూ వాట్సాప్‌లో సంప్రదించి నకిలీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. బాధితుడి రెండు క్రెడిట్ కార్డుల నుంచి 11 అక్రమ లావాదేవీలు జరిపి రూ.1,37,199 కాజేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని బంజారా గ్రీన్ కాలనీకి చెందిన మహమ్మద్ మజీద్ ఉద్దీన్ ఖాన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సిబ్బందిగా పరిచయం చేసుకుని వాట్సాప్ ద్వారా నకిలీ ఎస్‌బీఐ కార్డ్ అప్‌డేట్ ఏపీకే ఫైల్ పంపించారు. దానిని ఇన్‌స్టాల్ చేయడంతో బాధితుడి ఫోన్‌పై నియంత్రణ సాధించి రెండు క్రెడిట్ కార్డుల ద్వారా 11 లావాదేవీలు జరిపి డబ్బులు కాజేశారు. మొత్తం రూ.1,37,199 కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ దరిపల్లి చంద్రం

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 నుంచి 21 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, యువతలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నెహ్రూకు ఘన నివాళులు

భారతదేశ తొలి ప్రధాన మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రత్న పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం లోని నెహ్రూ పార్కులో ఆయన విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశస్వాతంత్ర్య పోరాటంలో జవహర్‌లాల్ నెహ్రూ అందించిన సేవలను, స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు.

కెసిఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోవద్దు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు


మాట్లాడుతున్నఅధ్యక్షుడు అత్తు

సిద్దిపేట రూరల్,నవంబరు 14, ప్రభాతవార్త : ప్రజలను మరోసారి మోసం చేయడానికే బిఆర్ఎస్, టిఆర్ఎస్, బిజెపి కలిసి నాటకాలు ఆడుతు న్నారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం బిఆర్ఎస్,టిఆర్ఎస్,బిజెపి గుంటనక్కలాగా ఎదరు చూస్తున్నారని పేర్కొన్నారు. పదేళ్ల కెసిఆర్ చేర నుంచి విడిపించి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, టిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత ప్రజల దృష్టిని మరలించేందుకు టిఆర్ఎస్ పార్టీని స్థాపించారని తెలిపారు. మళ్లీ కెసిఆర్‌ను అధికారంలోకి తీసుకరావ డానికి బిజెపి, బిఆర్ఎస్ కవిత పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండి పడ్డారు. కెసిఆర్ కుటుంబాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఈనెల 19న సిద్దిపేటలో జరిగే సిఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్,ఫయాజ్,నవాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్


కొమురవెల్లి, నవంబరు 14, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు కేంద్రా లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని రసులాబాద్‌లో శనివారం పిఏసి ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారం భించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనేకొనుగోలు చేయాలన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, పిఏసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, ఎఎంసి చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, వార్డు సభ్యులు ఎం.డి.బహదూర్, అనే బోయిన మల్లేశం, దుంబాల శ్రీకాంత్, పచ్చిమడ్ల మంజుల, పచ్చిమడ్ల రాధిక, లక్ష్మీ. ఎఎంసి డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దాచారంలో ఘనంగా బాలల దినోత్సవం

బెజ్జంకి, నవంబరు 14,ప్రభాతవార్త : మండల పరిధిలోని దాచారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బైర మానసరాజేందర్ మాట్లా డుతూ నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లల విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమం లో ఉప సర్పంచ్ దీటి బాలనర్సు,వార్డు సభ్యులు,కార్యదర్శి, వివిధశాఖల ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

హుస్నాబాద్ టౌన్, నవంబరు 14 ప్రభాతవార్త : భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని హుస్నాబాద్‌లోని అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శనివారం బాలల దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ఆదేశాలు, మార్గదర్శకత్వంలో విద్యార్థుల్లో నాయ కత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించేలా పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెల్ఫ్ గవర్నమెంట్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఉపా ధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు బోధించగా, ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారి క్రీడామైదానంలో వివిధ ఆటపాటల్లో పాల్గొ న్నారు. అదేవిధంగా చిన్నారుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద భరితమైన ఆటలు నిర్వహించారు. విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రద ర్శిస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యా ర్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, బాధ్యతా యుతమైన పౌరులుగా, భవిష్యత్ నాయకులుగా ఎదిగేందుకు దోహద పడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

బ్రహ్మంగారి విగ్రహం ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలి

నర్సాపూర్, నవంబరు 14 ప్రభాతవార్త

మండల పరిధిలోని నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిలోని చిన్నచింతకుంట బస్ స్టేజ్ సమీపం లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవా లయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం నర్సాపూర్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వ హించారు. ర్యాలీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై ప్రధాన రహదారిమీదుగా నర్సా పూర్ వరకు కొనసాగింది. ర్యాలీలో విశ్వకర్మలు జై విశ్వకర్మ జై జై విశ్వకర్మ అంటూ పెద్ద ఎత్తున నినా దాలు చేశారు. అనంతరం ఈ ర్యాలీ నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తా వరకు చేరి ఈ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ జిల్లా అధ్య క్షుడు వాల్డాస్ మల్లేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, ఓబిసి నాయకులు పాపగారి రమేష్‌గౌడ్, బిజెపి నాయకులు రఘువీరారెడ్డి హాజరై నిరసన ర్యాలీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ పునర్నిర్మాణంతో పాటు విగ్రహ పునఃప్రతిష్టకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని విశ్వకర్మ సంఘానికి హామీ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టిచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విశ్వకర్మల మనోభావాలు దెబ్బ తినేలా గుర్తుతెలియని వ్యక్తులు ఏ విధంగా పాల్ప డటం సహించరాలేదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకొని నిందితులను గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షిం చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విశ్వకర్మ శారద పీఠాధిపతి చంద్రమోళీశ్వరస్వామి, అఖిలభారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, ఉపాధ్యక్షురాలు మంజుల, విశ్వ కర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి చారి, రాష్ట్ర నాయకులు హనుమాన్, రామచంద్ర పురం రామ్మోహన్‌చారి, నర్సాపూర్ సంఘ నాయకులు నరసింహచారి, కృపాచారి నరేందర్ చారి ప్రవీణ్‌చారి, సదానందచారి, కాళిదాచారి, దయానంద్‌చారి నరేందర్‌చారి, మురళిచారి వెంకటేష్ చారి లింగం చారి, గజ్వేల్ సంగారెడ్డి మెదక్ కొల్చారం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి : డాక్టర్ నాగమున్నయ్య

గజ్వేల్ టౌన్, నవంబరు 14, ప్రభాతవార్త : మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లవల్ల నేడు ప్రతి ఒక్కరూ మధుమేహం బారిన పడుతు న్నారని, దీనిని అరికట్టేందుకు ప్రతిరోజు వ్యాయామం చేయడం, నడవడం అవసరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షుడు డాక్టర్ నాగమున్నయ్య అన్నారు. శనివారం ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో, ఆజాద్ డిఫెన్స్ అకాడమీ వారి సహకారంతో 3కె రన్, ఉచిత మధుమేహ పరీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నాగమున్నయ్య జెండా ఊపి 3కె రన్‌ను ప్రారంభించారు. అనంత రం వారు మాట్లాడుతూ మధుమేహంపై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, లయన్ సంజయ్‌గుప్తా, పరమేశ్వరచారి, గుడాల రాధాకృష్ణ, మల్లేశంగౌడ్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, సత్యనారాయణ, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ ఆరోగ్య శిబిరం విజయవంతం

గజ్వేల్, నవంబరు 14, ప్రభాతవార్త: గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో హంస హోమియోపతి మెడికల్ కాలేజ్, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మధుమేహ ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. ముందుగా బిహెచ్ఎంఎస్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గజ్వేల్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్‌బాబు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ప్రజలకు మధుమేహ సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఉచితంగా రక్తంలో గ్లూకోజ్ పరీక్షలు, వైద్య సంప్రదింపులు, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ అక్కలదేవి మాట్లాడుతూ మధుమేహం నేటి సమాజంలో వేగంగా విస్తరిస్తున్న ఆరోగ్య సమస్యగా మారిందని, సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రామాయంపేట, నవంబరు 14, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను శనివా రం ప్రగతి ధర్మారం గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ బండారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయం వారి అవసరాలకు ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీకుమార్‌సాగర్, వార్డు సభ్యుడు కామారం సుమన్, గ్రామ జనరల్ సెక్రటరీ సాకలి నారాయణ పాల్గొన్నారు.

పాదయాత్రికులకు ఆహార పానీయాలు పంపిణీ

జహీరాబాద్ నవంబరు 14 ప్రభాతవార్త : దారూర్ జాతరకు వెళ్తున్న క్రైస్తవ భక్తులకు నామా సుభద్రమ్మ ట్రస్ట్ అండగా నిలిచింది. దారూర్ జాతర లో పాల్గొనేందుకు ఎంతో భక్తిశ్రద్ధలతో కాలిబాటన పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు నామా సుభద్రమ్మ ట్రస్ట్ తరపున నామ అయాన్స్ బాదం పాలు, బిస్కెట్లు, అలాగే మంచినీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. జనహితమే లక్ష్యంగా, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ సర్వమత భావనను చాటుతూ నామ సుభద్రమ్మ ట్రస్ట్ చేపట్టిన ఈ ఉచిత పంపిణీ కార్యక్రమం దారిన వెళ్తున్న పాదయాత్రికులకు ఎంతో ఊరటనిచ్చింది.

విష్ణు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం

నర్సాపూర్, నవంబరు 14 ప్రభాతవార్త : భారత ప్రధాని పండిట్ జవ హర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని బీవీఆర్ఐటీలోని విష్ణు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనం తరం ప్రధానోపాధ్యాయురాలు నాగజ్యోతి, ఉపాధ్యాయులు ప్రసంగించారు. ఆ తరువాత విద్యార్థులందరూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో, ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమం బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, జనరల్ మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం బాలలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ వారిని అభినందించింది.

ఘనంగా బాలల దినోత్సవం

కొండపాక, నవంబరు 14, ప్రభాతవార్త

భారత దేశ తొలి ప్రధాన మంత్రి పండిత్ జవ హర్‌లాల్ నెహ్రు జయంతిని పురస్కరింకొని శని వారం కుకునూరుపల్లి మండల పరిధిలోని లకు డారం, మేదినిపూర్ గ్రామాల్లో సర్పంచులు శిల్పా నర్సింలు, మధు మోహన్ అధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈనాటి బాలలే రేపటి దేశ నిర్మాతలని నమ్మిన నెహ్రు పిల్లల సంక్షేమానికి కృషిని వారు గుర్తుచేసుకున్నారు. ఈనాటి బాలలే రేపటి బావి భారత పౌరులని వారి భవిష్యత్ కోసం బలమైన పునాదులు వేయడం మనందరి బాథ్యత అన్నారు. పిల్లల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేద్దామని సూచించారు. పాఠశాల విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని, పిల్లల భవిష్యత్తు భాగుండాలంటే తల్లిదండులు, ఉపాధ్యాయులు, మంచి ప్రవర్తనలో ప్రోత్సహించాలని వారు కోరారు. అనంతరం అంగన్‌వాడి, పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో క్రై బ్లాక్ కో అర్థినేటర్ నవతా, హెచ్ఎంలు వెంకటేశం, జానకీరాం రెడ్డి, ఉప సర్పంచులు నాగరాజు, యెల్లు శ్రీనివాస్‌రెడ్డి,గ కార్యదర్శి నవనీత, వార్డు సభ్యులు, అంగన్‌వాడి టీచర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలో...

మర్కుక్, నవంబరు 14 (ప్రభాతవార్త): మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో శనివారం సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్ ఆధ్వ ర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రాముఖ్యత, బాలల హక్కులు, విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. బాలలే దేశ భవిష్యత్తు అని, వారి అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవ్య, అంగన్వాడీ టీచర్లు అంబాబాయి, జ్యోతి, ఆశా కార్యకర్తలు హరిత, స్వప్న, అమ్మ ఆదర్శ పాఠశాల గ్రామ కమిటీ చైర్మన్లు రజిత, కవిత, సిఏలు కల్పన, భవాని, గ్రామ సమాఖ్య ప్రతిని ధులు పుణ్యవతి, లావణ్య, గ్రామ యువకులు పత్తి శంకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్గుపల్లిలో...

గజ్వేల్ టౌన్, నవంబరు 14 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ వెంకటలక్ష్మి అధ్యక్షతన శని వారం బాలల గ్రామసభను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సభలో విద్యార్థులు తమ పాఠ శాల అవసరాలు, గ్రామ అభివృద్ధిపై ఎంతో చక్కటి అభిప్రాయాలను పంచుకున్నారు. పిల్లలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ తరపున పూర్తి కృషి చేస్తామని సర్పంచ్ వెంకటలక్ష్మి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషోర్‌రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపి రెడ్డి, నాయకులు సిహెచ్.రాజు, యాదగిరి, పంచా యతీ కార్యదర్శి రేణుక, వార్డుమెంబర్లు కిరణ్, ప్రవీణ్, రజినీకాంత్, అరవింద్‌రెడ్డి, గణేష్, విద్యా ర్థులు పాల్గొన్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట, నవంబరు 14, ప్రభాతవార్త

స్థానిక మంజీర విద్యాలయంలో బాలల దినో త్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల దుస్తు లతో ప్రత్యేకంగా అలంకరించుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాలు, గేయాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వాసవి మాట్లాడుతూ, భారత తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్స వంగా జరుపుకుంటామని, పిల్లలపై ఆయనకు ఎంతో ప్రేమ ఉండేదని తెలిపారు. అందుకే చిన్నారులు ఆయనను ఆప్యాయంగా చాచా నెహ్రూ అని పిలుచుకునేవారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కరస్పాం డెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంధ్య, శ్రీశైలం, అనిల్, శ్రీనివాస్, సుధాకర్, శ్రీనిత, ఉపా ధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మేదినిపూర్‌లో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మంజీరా విద్యాలయంలో...



దామరకుంట గ్రామపంచాయతీలో


బూర్గుపల్లిలో బాలల గ్రామసభలో పాల్గొన్న విద్యార్థులు


శ్రీ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో కిక్కిరిసిన నాచగిరి క్షేత్రం

వర్గల్, నవంబరు 14, ప్రభాతవార్త : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసి పోయింది. కార్తీకమాసంలో మొదటి శనివారం 5వ రోజున సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో రద్దీగా మారింది. ఆలయానికి వచ్చిన భక్తులు ఉదయాన్నే కోనేరులో పుణ్యస్నానాలు ఆచ రించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా క్షేత్రంలో 114 జంటలు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించుకోగా, శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి వారికి నిజాభిషేకాలు, కళ్యాణము జరిపించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అధైర్య పడొద్దు...అండగా ఉంటా

బిఆర్ఎస్ నాయకులు, కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు

సిద్దిపేట అర్బన్, నవంబరు 14, ప్రభాతవార్త : సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు లింగారెడ్డిపల్లి హనుమాన్ గుడి సమీపంలో బొల్లు మహేష్ శివాని కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు దీపావళి రోజు రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం లో కిరాణా షాపు పూర్తిగా దగ్ధం కావడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించి అగ్ని ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లా దుతూ అధైర్యపడొద్దు అండగా ఉంటానని కిరాణా దుకాణం పునర్ నిర్మా ణానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్య క్రమంలో మాజీ కౌన్సిలర్ మల్యాల బాల్‌రాజు, సత్యంగౌడ్, కొండ రాజ్‌కుమార్,ఎజాజ్ పటేల్,మాంకాల రవి, చిన్నకోడూరు ఉప సర్పంచ్ కన్నారెడ్డి, సురేందర్‌గౌడ్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మాజీ కౌన్సిలర్, పాఠశాల చైర్మన్ ధర్మవరం బ్రహ్మం

సిద్దిపేట అర్బన్, నవంబరు 14, ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని క్రమశిక్షణతో పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ కౌన్సిలర్, పాఠశాల చైర్మన్ ధర్మవరం బ్రహ్మం సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్రీశుభోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానమంత్రి, పిల్లల పట్ల అపారమైన ప్రేమాభిమానాలు కలిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ప్రతి యేటా నవంబరు 14న బాలల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహు మతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

నెహ్రూ ఆశయాలే నవభారత నిర్మాణానికి స్ఫూర్తి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. కొమురవెల్లిలో శని వారం దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్...

మండల పరిధిలోని తడ్కపల్లి గ్రామంలో సర్పంచ్ తోడెంగల వెంకటేష్ ముదిరాజ్, ఉప సర్పంచ్, పాలక వర్గం ఆధ్వర్యంలో బాలల సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా పాఠశాలలో, హాస్టల్‌లో విద్యార్థుల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులు పలు సమస్యలను విన్నవించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేటి బాలలే రేపటి దేశానికి మార్గదర్శకులు: సర్పంచ్

హుస్నాబాద్ రూరల్, నవంబరు 14, ప్రభాతవార్త : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే చిన్నారులు ఆయనను ప్రేమగా చాచా నెహ్రూ అని పిలిచేవారని గాంధీ నగర్ గ్రామ సర్పంచ్ పోలు సంపత్ అన్నారు. నెహ్రూ జయంతి, జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వ ర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశానికి మార్గదర్శకులని, ప్రతి తల్లి దండ్రి పిల్లల చదువు, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రేయ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి స్థల దానం

చిన్నకోడూరు, నవంబరు 14, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం బైండ్ల సంఘం 200 స్థలాన్ని సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్‌కు అందజేశారు. స్థలంలో అంగన్ వాడీ భవనాన్ని నిర్మించి పేద పిల్లల కోసం అందించాలని సర్పంచ్‌ను కోరారు. కార్యక్రమలో బైండ్ల సంఘం ప్రతినిధులు బైండ్ల నర్సయ్య,బైండ్ల ఎల్లయ్య, బైండ్ల కిషన్,బైండ్ల మహేష్,బైండ్ల రవి,బైండ్ల భరత్‌కుమార్, బైండ్ల రాజయ్య, బైండ్ల చిన్న నర్సయ్య,వార్డు సభ్యులు పాల్గొన్నారు.


భవన నిర్మాణానికి స్థల దాన పత్రం అందజేస్తున్న దృశ్యం

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రామాయంపేట, నవంబరు 14, ప్రభాతవార్త : సిఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శనివారం ప్రగతి ధర్మారం గ్రామంలో ముగ్గురికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు బండారి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ బండారి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయం వారి అవసరాలకు ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీకుమార్‌సాగర్, వార్డు సభ్యుడు కామారం సుమన్, గ్రామ జనరల్ సెక్రటరీ సాకలి నారాయణ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public is do here-by informed that our clients 1) Syed Fareeduddin S/o Syed Moinuddin 2) Mohammed Abdul Rasheed S/o Shaik Mahboob 3) Ahmed Siddiqui S/o Kamil Siddiqui are intending to purchase Open Plots bearing No. 629, 630, 631 and 636 total admeasuring 800 Square Yards in Sy.No's 158, 159, 160, 179, 180, 181, 194, 195 & 198, situated at "Aira Infraserve Private Limited" Pothireddypally Village, Sangareddy Town, Mandal and District, Telangana from Shaik Mudassir Ahmed S/o Mahmood if any person or persons having any claim or objection regarding the above said transaction shall contact with original and authentic documents to the under signed office within 7 days from the date of this publication otherwise our clients will proceed with the transaction for the same in their names or their nominees and thereafter no claim will be entertained.

Sd/- M/s MOHAMMED ABDUL QAIYOUM
Advocate/Associates
Address: Flat No.203, 2nd Floor, Ranga View Apartments, Opp: Pillar No.35, Rethi Bowli, Hyderabad. Ph: 9246529108

కార్తీకమాసంలో వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం

-సిజిఆర్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ప్రత్యేకపూజలు



చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి, నవంబరు 14, ప్రభాతవార్త:
కార్తీకమాస శనివారం సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి నివాసంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని అత్యంతవైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆయన నివాసం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. ఉదయంనుంచే వేదమంత్రోచ్చారణలు, స్వామివారి నామస్మరణల మధ్య సంప్రదాయబద్ధంగా పూజా క్రతువులు కొనసాగాయి. చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్య దంపతులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే మాజీ సర్పంచ్‌లు చిమ్ముల లలిత, నరసింహారెడ్డి దంపతులు, చిమ్ముల దీప, నరేందర్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులుపొందారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సింగీతంలో బాల గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రావణినిరంజన్

రాయికోడ్ నవంబరు 14, ప్రభాతవార్త:
మండలంలోని సింగీతంగ్రామంలో శనివారం సర్పంచ్ శ్రావణినిరంజన్ అధ్యక్షతన బాలలదినోత్సవం సందర్భంగా గ్రామంలో బాల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి బాలలదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రావణినిరంజన్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలు అధికారులు సహకరించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దగొల్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మాచారి, మాజీ ఎంపిటిసి నిరంజన్, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, నాయకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

మడిగిలో మూడు ప్రభుత్వ భవనాల నిర్మాణం



ముమ్మరంగా సాగుతున్న నిర్మాణాలు

మొగుడంపల్లి, నవంబరు 14, ప్రభాతవార్త:
మండలంలోని మడిగి గ్రామంలో ప్రభుత్వ నిధులతో అంగన్‌వాడీ కేంద్రం, మహిళాశక్తి భవనం, ఫుడ్‌గ్రెయిన్ స్టోరేజ్ భవనాల నిర్మాణపనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ హర్షద్ జామాపటేల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మౌలికవసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవనాల నిర్మాణం పూర్తయితే చిన్నారులు, మహిళలు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పనులను నాణ్యతాప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

తాగునీటికి కటకట.. కంపెనీకి వందల ట్యాంకర్లు..

-అడ్డగోలుగా అక్రమ నీటి దందా..



పరిశ్రమల్లోకి ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లు పంపిస్తున్న దృశ్యం

మొగుడంపల్లి, నవంబరు 14, ప్రభాతవార్త:
ఒకవైపు నీటికరవుతో జనం అల్లాడిపోతుంటే, మరోవైపు కొందరు అక్రమార్కులు మాత్రం కాసులకోసం భూగర్భజలాలను అడ్డగోలుగా తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వందలాది నీటి ట్యాంకర్లను ప్రైవేట్ కంపెనీలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ ఘోరమైన నీటి దోపిడీ మొగుడంపల్లి, పరిసరప్రాంతాల్లో యథేచ్ఛగా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే.. మొగుడంపల్లి శివారులో ఉన్న హట్సన్ పరిశ్రమ (ఐస్‌క్రీమ్) పరిశ్రమకు ప్రతిరోజూ వందలాది నీటిట్యాంకర్లు అక్రమంగా తరలిపోతున్నాయి. పర్వతపూర్, గోవిందపురం తదితరప్రాంతాల నుంచి అడ్డగోలుగా నీటిని తోడేసి ఈ కంపెనీకి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ అక్రమ నీటిదందా వెనుక కొందరు సర్పంచ్‌లు ప్రస్తుత ప్రజాప్రతినిధులు, బడా కాంట్రాక్టర్ల హస్తం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వీరికి ఎలాంటి అధికారిక అనుమతులులేకపోయినా, అధికారుల కళ్లుగప్పి లేదా వారి అండదండలతోనే ఈదందాను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీల లాభాలకోసం ప్రజలదాహాన్ని ఫణంగాపెడుతున్న ఈ నీటిమాఫియాపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని, తక్షణమే ఈనీటిదోపిడీని అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు.

స్కూల్ అటెండర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-టియుసిసి జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్

నారాయణఖేడ్, నవంబరు 14, ప్రభాతవార్త:
ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అటెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, సంబంధిత విద్యాశాఖాధికారులు వెంటనే పరిష్కరించాలని టియుసిసి (ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్‌చేశారు. కంగ్టి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న అటెండర్ల జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అటెండర్లకు నెల నెలా ఒకేవిధంగా వేతనాలు చెల్లించడంతో పాటు కనీస వేతనం రూ.21 వేలు అమలుచేయాలని డిమాండ్‌చేశారు. పెండింగ్ జీతాలను వెంటనే విడుదలచేయాలని, వేతనాలు పెంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్ధి రాములు, వెంకటరెడ్డి, చంద్రకాంత్, నల్గొండ సక్రం, లలితమ్మ, మీరాబాయి, కిష్టమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీని తక్షణమే ప్రారంభించాలి...

-ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఓంకార్ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:
మండల పరిధిలోని కొత్తూరు(బి)లో మూతపడిన ట్రైడెంట్(ప్రస్తుతం) ఓంకార్ షుగర్ ఫ్యాక్టరీని చెరకు రైతుల శ్రేయస్సు దృష్ట్యా పునఃప్రారంభించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్యరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం ఎమ్మెల్యే పార్టీ నాయకులు, చెరుకు రైతులతో కలిసి సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఫ్యాక్టరీ ప్రారంభానికి మరో 40నుంచి 50రోజులు పడుతుందని జనరల్ మేనేజర్, అధికారులు తెలపడంతో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్యరావు మాట్లాడుతూ ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వల్ల చెరుకు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, ఫ్యాక్టరీ ప్రారంభంలో జాప్యం జరిగితే చెరుకు ఎండిపోయి బరువు తగ్గడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి వెంటనే క్రషింగ్ ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. గతంలో పనిచేసిన స్థానిక కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ కల్పించుకొని తక్షణమే క్రషింగ్ ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్‌లు విజయ్‌కుమార్, పెంటారెడ్డి, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, కొత్తూరు సర్పంచ్ మహాదేవి మల్లికార్జున, పలు గ్రామాల సర్పంచ్‌లు మచ్చేందర్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, రాథోడ్ భీమ్రావునాయక్, రాజు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, గ్రామపార్టీ అధ్యక్షులు, రైతుసంఘం తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 14, ప్రభాతవార్త:
చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపికలు-2026-27 క్రీడలు రెండోరోజు క్రీడల సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రస్థాయి క్రీడలు నర్సాపూర్ నియోజకవర్గంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న క్రీడలలో పాల్గొన్న విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, టిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత అధికారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే మహిళలు ఆర్థికంగా ఎదగాలి

-జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలితకుమారి



కుట్టుమిషన్లను పంపిణీచేస్తున్న మహిళా సంక్షేమాధికారిణి లలితకుమారి

జహీరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త:
మహిళలు తమలోని నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలితకుమారి అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వికాస్‌సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో కోల్ ఇండియా ఆర్థిక సహకారంతో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ సర్వీసెస్(వికాస్) సంస్థ ఆధ్వర్యంలో 220మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లలితకుమారి మాట్లాడుతూ కోల్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో వికాస్‌సంస్థ మహిళలకు ఉచితంగా కుట్టుపనిలో శిక్షణ అందించి, కుట్టుమిషన్లు పంపిణీ చేయడంద్వారా స్వయం ఉపాధికి బాటలువేయడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షులు కొత్తకాపు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కోల్ ఇండియా సహకారంతో ఇప్పటివరకు సుమారు 1,500మంది మహిళలకు కుట్టుపనిలో శిక్షణ, ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ కోల్ లిమిటెడ్ మాజీ సిఎండి బి.రామచంద్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీషారెడ్డి, వికాస్‌సంస్థ కార్యదర్శి కొత్తకాపు సురేందర్‌రెడ్డి, సభ్యులు ఆర్.నరసింహారెడ్డి, సుగుణాకరరావు, కౌన్సిలర్ డి.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలితకుమారి, బి.రామచంద్రరెడ్డి, కొత్తకాపు లక్ష్మారెడ్డి, శిరీషారెడ్డి, సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. శిక్షణ పొందిన మహిళలు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ భారత్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే



అంతర్జాతీయ సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 14, ప్రభాతవార్త:
హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ భారత్ సమ్మిట్-2026 కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు హాజరయ్యారు. సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రపంచ రాజకీయ పరిణామాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం, పెట్టుబడుల అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో భాగస్వామ్యం కావడం విశేషం.

దేశనిర్మాణానికి పునాదులు వేసిన మహానేత నెహ్రూ..

-టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



నివాళి అర్పిస్తున్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 14, ప్రభాతవార్త:
భారతదేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించి, దేశనిర్మాణానికి బలమైన పునాదులు వేసిన మహానాయకుడు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కొనియాడారు. శనివారం నెహ్రూ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబి జంక్షన్ వద్ద నెహ్రూ విగ్రహానికి జగ్గారెడ్డి, టిజిఐఐసి మాజీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలనే దూరదృష్టితో నెహ్రూ ముందుకు సాగారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియ, శాసన, న్యాయ వ్యవస్థల పటిష్టతకు నెహ్రూ విశేష కృషిచేశారని పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధిలో నెహ్రూ-గాంధీ కుటుంబం పాత్ర మరువలేనిదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆనాటి కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన పరిశ్రమలు, ప్రాజెక్టుల ఫలాలను నేటికీ ప్రజలు అనుభవిస్తున్నారని అన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు..

-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య..



వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ చైర్మన్

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 14, ప్రభాతవార్త:
పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని సాధించవచ్చని, సమాజ అభ్యున్నతికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుమాత్రమే కాకుండా విజ్ఞానాన్ని అందించే కేంద్రాలని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, పుస్తక ప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ జెఎన్‌టియులో మెగా జాబ్‌మేళా

చౌటకూర్, నవంబరు 14, ప్రభాతవార్త:
అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ (ఆదివారం) మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పుల్కల్, చౌటకూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి, బోడపట్ల గణేష్ ముదిరాజ్ తెలిపారు. చౌటకూర్‌మండల సుల్తాన్‌పూర్ జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10గంటలకు ఈ జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జాబ్‌మేళా ద్వారా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని వారు పేర్కొన్నారు. 10వ తరగతి ఆపై చదువులు చదివిన, 18సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.19,288 వేతనం అందించనున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని కొంగరకలాన్ కెకెపార్కులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. రొటేషనల్ షిఫ్ట్ విధానంలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, వారానికి ఒకరోజు సెలవుతో పాటు ఉచితభోజనం, రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లుపేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బ్యాంక్ పాస్‌బుక్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దుర్గారెడ్డి, బోడపట్ల గణేష్‌ముదిరాజ్ కోరారు.

జాడిమల్కాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

-గ్రామస్థులకు వైద్య పరీక్షలు.. ఆరోగ్యంపై అవగాహన

మొగుడంపల్లి, నవంబరు 14, ప్రభాతవార్త:
మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామంలో సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామస్థులు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎజాజ్ పటేల్, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు ముకుంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మరెడ్డిగూడెంలో సామూహిక సత్యనారాయణవ్రతం

-35 జంటలతో ప్రత్యేకపూజలు.. అన్నదాన కార్యక్రమం

చౌటకూర్, నవంబరు 14, ప్రభాతవార్త:
కార్తీకమాసాన్ని పురస్కరించుకొని చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం గ్రామంలోని భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామసర్పంచ్ జైపాల్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 35జంటలు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్తీకమాస పవిత్రతను చాటుతూ భక్తులు కుటుంబ సమేతంగా వ్రతంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ జైపాల్‌నాయక్, ఉపసర్పంచ్ రజనీగోపాల్, వార్డుసభ్యులు గోపాల్, సుభాష్, మేనక, స్రవంతి, ఆత్మకమిటీ డైరెక్టర్ రాములు, శంకర్‌నాయక్, దేవిదాస్, ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత అధికారులు పాండురంగం, విట్టల్, గోవిందరావు, హరిసింగ్, తారాసింగ్, గోపాల్, సిఐ, జయరాం సిడిపిఒ, రాజు, కిషన్, మోహన్‌లాల్, రఘునాయక్, సురేందర్, గణేష్, హరి, రాములు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల సభ



బాలల సభ నిర్వహిస్తున్న సర్పంచ్ తాళ్లరామయ్య

చిలిపిచెడ్, నవంబరు 14, ప్రభాతవార్త:
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫైజాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచ్ తాళ్ల రామయ్య అధ్యక్షతన, సోమక్కపేటలో సర్పంచ్ వేస్తే దుర్గాచలం ఆధ్వర్యంలో బాలలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు విద్యాహక్కు చట్టం, బాల్యవివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నివారణపై అవగాహన కల్పించారు. అలాగే ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. బాలల హక్కుల పరిరక్షణ, ప్రతి ఒక్కరికీ విద్య అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శి మోహన్, వార్డుసభ్యులు నవనీత, మాధవి, విఠ మాధవి, అంగన్‌వాడీ టీచర్‌తో పాటు గ్రామస్థులు సుధాకర్, మల్లేశం, శ్రీశైలం, దుర్గయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత ఏర్పడకుండా చర్యలు

-పశువైద్యాధికారి డాక్టర్ విశాల్

కొల్చారం, నవంబరు 14, ప్రభాతవార్త:
పశుగ్రాసం కొరత ఏర్పడకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ విశాల్ సూచించారు. చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 53గేదెలు, 9ఆవులు, 50దూడలకు నట్టలనివారణ మందులు తాగించారు. గేదెలకు గర్భకోశ సంబంధిత చికిత్సలు నిర్వహించడంతోపాటు పాల ఉత్పత్తి పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుపోషణలో అనుసరించాల్సిన పద్ధతులను డాక్టర్ విశాల్ రైతులకు వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిషతులో పశుగ్రాసం సమస్య తలెత్తకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిబిజిరాంజి పథకం ద్వారా పశుగ్రాసం పెంపకానికి ఉన్న అవకాశాలు, పథకం అమలువిధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాల ఉత్పత్తిని పెంచుకోవడా ద్వారా పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్ల మల్లేశం, సిబ్బంది అర్జునయ్య, గోవర్ధన్, గోపాలమిత్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

-ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సాపూర్ శంకర్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు నర్సాపూర్ శంకర్

నారాయణఖేడ్, నవంబరు 14, ప్రభాతవార్త:
మండలపరిధిలోని జూకల్ శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సాపూర్ శంకర్ ఆరోపించారు. పాఠశాలలో ప్రతి రెండోశనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అందరినీ ఆహ్వానించకుండా కేవలం కొంతమంది తల్లిదండ్రులను మాత్రమే పిలిచి, మిగతాస్థానాల్లో ఉపాధ్యాయులను కూర్చోబెట్టి తల్లిదండ్రులుగా చూపించడం సరికాదన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల మధ్య గ్రూపు తగాదాల కారణంగా విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే టిజిటి ఉపాధ్యాయురాలు నాగరాణి వారానికి రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, హాజరు రిజిస్టర్ పరిశీ లించగా మిగతా రోజుల్లో సెలవులో ఉన్నట్లు నమోదైందని ఆరోపించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారిని ప్రశ్నించగా, ఆమె సెలవులో ఉంటే తానేమి చేయాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపా రు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులైన ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, ఉపాధ్యాయురాలు నాగరాణిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యం లో గురుకుల పాఠశాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి ప్రశాంతి, గంగవర్ సంజీవ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులతో చిల్డ్రన్స్ డే వేడుకలు

-సర్పంచ్ దేవిసింగ్ ఆధ్వర్యంలో సమావేశం



చిల్డ్రన్స్ వేడుకల్లో మాట్లాడుతున్న సర్పంచ్ దృశ్యం

కొల్చారం, నవంబరు 14, ప్రభాతవార్త:
జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని కొల్చారం మండల పరిధిలోని నాయిని జలాల్‌పూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవిసింగ్ ఆధ్వర్యంలో చిన్నారులతో ప్రత్యేకసమావేశం ఏర్పాటుచేసి నెహ్రూ సేవలను స్మరించుకున్నారు. అనంతరం పలువురుమహిళలు అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లలకు అందించేభోజనంలో పప్పు, గుడ్డు వంటి ఆహారపదార్థాలను సక్రమంగా వండకుండా అందించడం వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రభావంపడే అవకాశం ఉందని సర్పంచ్‌దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సర్పంచ్ దేవిసింగ్, పంచాయతీ కార్యదర్శి మోనిక ఇలాంటి సమస్యలు పునరావృతంకాకుండా చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాయిని వెంకట నరసింహులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డుసభ్యులు నాయకులు, మల్టీ పర్పస్ వర్కర్లు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.